క్లుప్తంగా

మొక్కలు నాటిన గ్రామస్తులు



సంగం: మండలంలోని అపరపనాయుడుకండ్రిక గ్రామంలో లగడపాటి రాజగోపాల్ తల్లి లగడపాటి రామలక్ష్మమ్మ సొంత నిధులతో మంగళవారం స్థానికులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా 160 మొక్కలను జాతీయ రహదారి నుంచి గ్రామం వరకు నాటారు. కార్యక్రమంలో బాణా శ్రీనివాసులురెడ్డి, ఆదిశేషారెడ్డి, రవీంద్ర నాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భోగికి సిద్ధమవుతున్న చిన్నారులు



రేగి కంపను తీసుకెళుతున్న చిన్నారులు

కొండాపురం: సంక్రాంతి పండగ సమీపిస్తుండడంతో భోగి పండగకు భోగి మంటలు వేసేందుకు చిన్నారులు, యువకులు సిద్ధమవుతున్నారు. ఆయా గ్రామాల్లో దొరికే తాటి ఆకులు, రేగి కంపను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. భోగి మంటలు పెద్ద ఎత్తున వేసేందుకు చిన్నారులు, యువకులు పోటీ పడి వీటిని సేకరిస్తున్నారు.

పింఛన్ల అందజేత



ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో 19వ వార్డులో నూతనంగా మంజూరైన డప్పు కళాకారులు, చర్మకారుల పింఛన్లను ఆ వార్డు కౌన్సిలర్ కొండా స్వరూపరాణి మంగళవారం అందజేశారు. గతంలో వారు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోగా నూతనంగా పింఛన్లు మంజూరైనట్లు స్వరూపరాణి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొండా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే ప్రమాదం



బస్‌స్టేషన్‌కు వెళ్లే మార్గంలో ఏర్పడ్డ ప్రమాదకర గుంత

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఆర్టీసీ డిపో బస్‌స్టేషన్‌కి రాకపోకలు సాగించే మార్గంలో ప్రమాదం పొంచి ఉంది. డిపోలోకి వెళ్లే దారికి అడ్డంగా మున్సిపాలిటీ వారి మురుగునీరు ప్రవహించేందుకు కాలువపై నిర్మించిన కాంక్రీట్ బ్రిడ్జి ఆరు నెలల క్రితం కూలిపోయి మధ్యలో గుంతలు పడింది. అప్పట్లో ఆ గుంతకు అడ్డంగా ముళ్లకంప ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో డిపోకు రాకపోకలు సాగించిన ద్విచక్ర వాహనదారులు సమీపంలోకి వచ్చేవరకు గుంత కనిపించక ప్రమాదాల బారిన పడ్డ సందర్భాలు ఉన్నాయి. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పోలీసుల అదుపులో ఎంఎస్ రాజు

సోమశిల: టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజు కావలిలో తలపెట్టిన చలో కావలి కార్యక్రమానికి వెళుతుండగా ఆత్మకూరు సీఐ నాగేశ్వరరావు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. సోమశిల పోలీస్‌స్టేషన్‌లో సాయంత్రం వరకు ఉంచి ఆత్మకూరుకు తరలించారు.

బావుల్లో క్లోరినేషన్

చేజర్ల: చేజర్ల పంచాయతీలో ఉన్న మంచినీటి బావుల్లో క్లోరినేషన్ చేశామని పంచాయతీ కార్యదర్శి రామయ్య మంగళవారం తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న దృష్ట్యా బావుల్లో క్లోరినేషన్ చేసినట్లు తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించారని ఫిర్యాదు

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : తమ విధులకు ఆటంకం కలిగించారని విడవలూరు సంఘమిత్ర కోశాధికారి కల్పన ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆనంద్‌భాస్కర్‌బాబు తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. మండలంలోని ఊటుకూరులో వెలుగు ఆధ్వర్యంలో వీఓఏగా భవాని విధులు నిర్వహిస్తోంది. ఆమె పరిధిలో పొదుపు సంఘాలు తీసుకున్న స్త్రీనిధికి చెందిన నిధుల చెల్లింపు విషయంలో తేడా వచ్చింది. దీంతో ఏపీఎం హరి మంగళవారం భవానికి ఫోన్ చేసి నీ సంఘబంధంలో నిధులు చెల్లింపులో తేడా వస్తోందని, త్వరగా చెల్లించాలని కోరారు. దీంతో భవాని తన భర్త వెంగళరావును తీసుకుని విడవలూరు వెలుగు కార్యాలయానికి చేరుకుని అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని, సంఘమిత్ర సిబ్బందిని దుర్భాషలాడి, విధులకు ఆటంకం కలించారు. ఈ మేరకు సంఘమిత్ర కోశాధికారి కల్పన ఇచ్చిన ఫిర్యాదు మేరకు భవాని, ఆమె భర్త వెంగళరావులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలి



రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

ఆత్మకూరు: అవకాశం ఉన్న వారు ప్రాణాపాయంలో ఉన్న వారికి రక్తదానం చేసి వారి ప్రాణాలు కాపాడాలని, ఈ విషయంలో యువత చొరవచూపాలని పలువురు వక్తలు కోరారు. పట్టణంలోని ఎస్‌ఆర్‌జేడీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీల ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల విద్యార్థులతోపాటు పలువురు యువత స్వచ్ఛందంగా ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఒక వ్యక్తి ఒక్కసారి రక్తదానం చేస్తే, ఆ రక్తంతో ముగ్గురు ప్రాణాలు కాపాడవచ్చని అన్నారు. ఆరోగ్యవంతులైన వారు ఏడాదికి మూడుసార్లు రక్తదానం చేయవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా 60 మందికి పైగా విద్యార్థులు, యువత రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వరకుమారి, పీడీ సిరిమామిళ్ల వెంకటేశ్వర్లు, రెడ్‌క్రాస్ కార్యదర్శి సాధిక్ హుస్సేన్, జేవీవీ నాయకుడు లక్కు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఉప రాష్ట్రపతిని కలిసిన నాయకులు



వెంకయ్యనాయుడుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఆత్మకూరు: మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడుని ఆత్మకూరుకు చెందిన పలువురు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వెంకటాచలంలోని స్వర్ణభారతి ట్రస్ట్ కార్యాలయం వద్ద బీజేపీ నాయకులు కుడుముల సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మకూరువాసులు కలిశారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు గతంలో తనకు ఆత్మకూరులో పరిచయం ఉన్న పలువురు వ్యక్తుల గురించి ప్రస్తావించారు. రైతాంగం గురించి మాట్లాడుతూ ఇటీవల తుపానుకు పంట నష్టం గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో సీహెచ్ రమణయ్యనాయుడు, చెరుకూరు శ్రీనివాసులు, మాదాల శ్రీనివాసులు పాల్గొన్నారు.

సర్వే సక్రమంగా చేపట్టాలి

ఉదయగిరి: మండలంలోని 17 పంచాయతీల్లో బుధవారం నుంచి జరిగే మిషన్ అంత్యోదయ సర్వేను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ సూచించారు. మంగళవారం ఎంపీడీఓ ఉదయగిరిలోని తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల పరిధిలో అన్ని వసతులపై సమగ్ర సర్వే నిర్వహించి త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, వీఓఏలు సమన్వయంతో సర్వే నిర్వహించాలని తెలిపారు.

రేపటి నుంచి షటిల్ టోర్నమెంట్

సీతారామపురం: మండల కేంద్రం సీతారామపురంలో గురువారం నుంచి శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టోర్నీ విజేతలకు రూ.10 వేలు, రెండో బహుమతిగా రూ.6 వేలు, మూడో బహుమతిగా రూ.3 వేలు, నాలుగో బహుమతిగా రూ.2 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల జట్లు 11వ తేదీ సాయంత్రం లోపు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. వివరాలకు 9494833398, 7730973749 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

బహిరంగ సభలు, ర్యాలీలకు అనుమతి తప్పనిసరి

కొండాపురం: మండలంలో ఎక్కడైనా బహిరంగ సభలు, ర్యాలీలు నిర్వహించుకోవాలంటే పోలీసులు అనుమతులు తప్పనిసరిగా పొందాలని కొండాపురం ఎస్సై షేక్ ఖాజావలి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సభలు, ర్యాలీలు నిర్వహించే సమయంలో పోలీసులకు సమాచారం అందజేసి అనుమతులు పొందిన అనంతరం నిర్వహించుకోవాలని తెలిపారు. అలాగే సంక్రాంతి పండగ సందర్భంగా మండలంలో ఎక్కడైనా కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సాగరంలో మెగా క్రికెట్ టోర్నమెంట్

సోమశిల: ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా అనంతసాగరంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు జాలీబాయ్స్ టీం తెలిపింది. ప్రథమ బహుమతి రూ.10,116, రెండో బహుమతి రూ.5,116లతోపాటు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ది సిరీస్‌కు ప్రత్యేక బహుమతులు ఉంటాయని తెలిపారు. ఆసక్తి గల వారు 9347337500, 9963636983 తమ ఎంట్రీలను నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

చేజర్ల: గత మూడు రోజులుగా ఆత్మకూరు నియోజకవర్గ స్థాయిలో ఎంజీఆర్ మెమోరియల్ క్రికెట్ పోటీలు చేజర్ల మండలంలోని గొల్లపల్లి గ్రౌండ్స్‌లో ఉత్సాహంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం రెండు మ్యాచ్‌లు జరిగాయి. ఒక మ్యాచ్‌లో చేజర్ల చాలెంజర్స్ – టీకే పాడు జట్లు తలపడగా, మరో మ్యాచ్‌లో చేజర్ల కండ్రిక – పుట్టుపల్లి జట్లు తలపడ్డాయి. వారం రోజులపాటు ఈ పోటీలు జరుగుతాయని నిర్వాహకుడు ఎం.కల్యాణ్ తెలిపారు.

అసైన్‌మెంట్ కమిటీతో పేదలకు లబ్ధి

సోమశిల: ప్రభుత్వం చేపడుతున్న అసైన్‌మెంట్ కమిటీ ద్వారా పేదలకు లబ్ధి చేకూరుతుందని డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లి, గౌరవరం గ్రామాల్లో అసైన్‌మెంట్ కమిటీ గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ గ్రామాల్లో అర్హులైన భూమి లేని నిరుపేదలకు భూములు పంచే ఉద్దేశంతో అసైన్‌మెంట్ కమిటీని త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అందులో అర్హులైన వారి జాబితాను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కాలువ నరసింహులు, సర్పంచ్‌లు శాఖమూరి సుబ్బారావు, రమీజాబేగం, గ్రామస్తులు పాల్గొన్నారు.

ట్రైనీ కలెక్టర్ పరిశీలన



హసనాపురంలో గ్రామ కొలను పనుల వివరాలు తెలుసుకుంటున్న ట్రైనీ కలెక్టర్

అనుమసముద్రంపేట: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ట్రైనీ కలెక్టర్ జి.విద్యాధరి పర్యటించారు. ముందుగా హసనాపురం గ్రామంలో నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న గ్రామ కొలను పనులను ఆమె పరిశీలించారు. అనంతరం ఏఎస్‌పేట బిట్–1 సచివాలయ సిబ్బందితో పలు అంశాలపై మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అక్కడి నుంచి అనుమసముద్రంలో వైఎస్సార్ జలకళ పథకాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. చిన్నబ్బీపురం గ్రామంలో ప్రభుత్వ నిధులతో జరుగుతున్న చెక్‌డ్యామ్ పనులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నిర్మలాదేవి, ఏపీడీ శంకరనారాయణ, నవీన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రభాకర్ రెడ్డి, రైతులు తదితరులు ఉన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు



కావలిరూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మన్నెమాల సుకుమార్ రెడ్డి సహకారంతో కావలి నియోజవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న వైఎస్ జగనన్న క్రికెట్ టోర్నమెంట్ హోరాహోరీగా సాగుతోంది. ఈ పోటీలు తుమ్మలపెంట రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో ఈతమొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, మన్నెమాల ధీరజ్‌రెడ్డి పర్యవేక్షణలో జరుగుతున్నాయి. టోర్నమెంట్‌లో భాగంగా మంగళవారం మొదటి మ్యాచ్‌లో బెస్ట్ లెవెన్స్ – నాని లెవెన్స్ జట్లు తలపడగా 30 పరుగుల తేడాతో బెస్ట్ లెవెన్స్ విజయం సాధించింది. 22 పరుగులు, 1 వికెట్ సాధించిన జయంత్(జార్జ్) మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. రెండో మ్యాచ్‌లో శ్రీరాంపురం లెవెన్స్ – ఇండియన్ సోల్జర్స్ లెవెన్స్ జట్లు తలపడగా శ్రీరాంపురం లెవెన్స్ జట్టు 5 పరుగులతో విజయం సాధించింది. 26 పరుగులు, 3 వికెట్లు తీసిన రమేష్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు తాలూకా యూనిట్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఉదయగిరి తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కొండారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో 19 యూనియన్ పోస్టులకు గాను 19 మంది మాత్రమే నామినేషన్ వేయడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. అధ్యక్షుడిగా షేక్ ఖాదర్‌బాషా, అసోసియేట్ అధ్యక్షుడిగా డాక్టర్ రాకేష్, కార్యదర్శిగా పద్మనాభరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శ్రీనివాసులు, కోశాధికారిగా ప్రసాద్ బాబు, ఉపాధ్యక్షులుగా లలిత, శివయ్య, ప్రతాప్ రెడ్డి, అబ్దుల్ రవూఫ్, చిన్నయ్య, భూదేవి, జాయింట్ సెక్రటరీగా సుబ్బారావుతోపాటు పలువురు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ఎన్నికైన వారితో ప్రమాణ స్వీకారం చేయించారు.

విజేతలకు అభినందన



క్రికెట్ పోటీల్లో విజేతలైన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ఇటీవల జరిగిన విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలోని అంతర్ కళాశాలల జోన్ క్రికెట్ పోటీల్లో విజేతలైన స్థానిక ఎస్‌ఆర్‌జేడీ కళాశాల విద్యార్థులను మంగళవారం ఆ కళాశాలలో పీడీ సిరిమామిళ్ల వెంకటేశ్వర్లు తదితరులు ప్రత్యేకంగా అభినందించారు. కాగా వారు త్వరలో రాష్ట్రస్థాయిలో జరిగే క్రికెట్ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని పేర్కొన్నారు. విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వరకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

న్యాయమైన కోర్కెలు నెరవేర్చాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆత్మకూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న కార్యకర్తలు, సహాయకుల న్యాయమైన కోర్కెలు ప్రభుత్వం సహృదయంతో పరిశీలించి నెరవేర్చాలని ఆత్మకూరు సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు కోరారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట తమ డిమాండ్ల సాధన కోసం ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ సాధు కరుణకుమారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కె.హజరత్తయ్య, అంగన్‌వాడీ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి పి.రాధమ్మ, కార్యవర్గ సభ్యులు కె సుజాత, సుప్రజ, దొరసానమ్మ, పుష్పకళ, మస్తానమ్మ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణంలో విజిలెన్స్ తనిఖీలు



రేషన్ దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ఆత్మకూరు: పట్టణంలోని సత్రం సెంటర్ సమీపంలో ఉన్న 16వ నంబర్ రేషన్ దుకాణంలో విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. జిల్లా విజిలెన్స్ అధికారి గోపాలకృష్ణ తన సిబ్బందితో ఆ దుకాణంలో తనిఖీలు నిర్వహించగా ఉండాల్సిన సరుకు కన్నా అదనంగా 15 బస్తాల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఇప్పటికే ఆ దుకాణదారుడు సుధాకర్‌పై పలు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో అక్రమ బియ్యం నిల్వలు బయటపడడం గమనార్హం. ప్రభుత్వ లక్ష్యం దెబ్బతినేలా పేదలకు ఇవ్వాల్సిన రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అధికారులు తెలిపారు. వారి వెంట ఆత్మకూరు డిప్యూటీ తహసీల్దార్(రేషన్) శ్యామలాదేవి ఉన్నారు.

ఆదర్శ పాఠశాలలో విచారణ



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ ఈఓ హరిప్రసాద్

మర్రిపాడు: మండలంలోని నందవరం ఆదర్శ పాఠశాలలో డిప్యూటీ ఈఓ హరిప్రసాద్ మంగళవారం విచారణ చేపట్టారు. నెల రోజుల క్రితం హాస్టల్‌లో గుర్తుతెలియని వ్యక్తి సంచరించడంతో అప్పట్లో పోలీసు కేసు నమోదైంది. ఈ ఘటనకు సంబంధించి మంగళవారం డిప్యూటీ ఈఓ హరిప్రసాద్, మండల విద్యాశాఖాధికారి మాలకొండయ్య విచారణ నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విచారణలో తెలుసుకున్న అంశాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. వారి వెంట పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప మాలధారులు



శబరిమలకు పయనమైన అయ్యప్ప మాలధారులు

సంగం: సంగంలో మండల దీక్ష పూర్తి చేసుకొన్న అయ్యప్ప మాలధారులు మంగళవారం శబరిమలకు బయలుదేరారు. ముందుగా అయ్యప్ప మాలధారులు స్థానిక శివాలయంలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. గురుస్వామి భక్తిశ్రద్ధలతో ఇరుముడులు కట్టారు. శివాలయం నుంచి ఆంజనేయస్వామి ఆలయం వరకు స్వామియే శరణమయ్యప్ప అంటూ అయ్యప్ప మాలధారులు శరణుఘోషతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనంలో శబరిమలకు బయలుదేరివెళ్లారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు



ఉదయగిరి: తీవ్రంగా గాయపడిన అరవింద్ పటేల్

ఉదయగిరి: ఎదురెదురుగా వస్తున్న బైక్, ట్రాలీ ఆటో ఢీకొనడంతో ఇద్దరు యువకులు గాయపడిన ఘటన మంగళవారం పట్టణంలోని గండిపాళెం మార్గంలోని పెట్రోల్ బంక్ సమీపంలో చోటుచేసుకుంది. ప్రకాశం జిల్లా పామూరుకు చెందిన అరవింద్ పటేల్, షబ్బీర్ బైక్‌పై ఉదయగిరికి వచ్చి తిరిగి పామూరుకు వెళుతున్నారు. అదే మార్గంలో ఎదురెదురుగా వస్తున్న ట్రాలీ ఆటో.. వీరి బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో అరవింద్ పటేల్‌కు తీవ్రగాయాలు కాగా, షబ్బీర్‌కు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగాత్రులను చికిత్సనిమిత్తం 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వైద్యులు నెల్లూరుకు సిఫార్సు చేశారు. సమాచారం అందుకున్న ఏఎస్సై శ్రీనివాసులు వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మకూరు – వింజమూరు మార్గంలో..

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణానికి సామాను కొనుగోలు కోసం మోటారు సైకిల్‌పై వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళుతున్న క్రమంలో బైక్ అదుపుతప్పి పడిపోయి ఇద్దరు గాయపడిన ఘటన ఆత్మకూరు – వింజమూరు మార్గంలో చోటుచేసుకుంది. బాధితుల వివరాల మేరకు ఏఎస్‌పేట మండలం పొనుగోడుకు చెందిన పెంచలయ్య, మరో వ్యక్తితో కలిసి మోటారు సైకిల్‌పై మంగళవారం ఆత్మకూరుకు వచ్చాడు. సామాను కొనుగోలు చేసి తిరిగి గ్రామానికి వెళుతుండగా ఆత్మకూరు – వింజమూరు మార్గంలో నబ్బీనగరం గ్రామ సమీపంలో మోటారు సైకిల్ అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్లలోకి దూసుకెళ్లి పడిపోయింది. ఈ ఘటనలో పెంచలయ్యతోపాటు బైక్‌పై వెనుక కూర్చున్న వ్యక్తికి కూడా గాయాలయ్యాయి. ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు గమనించి క్షతగాత్రులను చికిత్సనిమిత్తం 108 వాహనంలో ఆత్మకూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు.

బైక్ అదుపుతప్పి..

ఓ వ్యక్తి బైక్‌పై ప్రయాణిస్తూ అదుపుతప్పి ఎదురుగా ఉన్న పానీపూరీ బండిని ఢీకొని పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. ఆత్మకూరు ఎస్సై ఎం.శివశంకరరావు వివరాల మేరకు మండలంలోని నల్లపురెడ్డిపల్లి గ్రామానికి చెందిన దండు రత్నకుమార్ మంగళవారం రాత్రి బైక్‌పై ఆత్మకూరుకు వస్తున్నాడు. మున్సిపల్ పరిధిలోని బైట్టేపాడు మార్గంలో కాశీనాయన ఆశ్రమం సమీపంలో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న పానీపూరీ బండిని ఢీకొట్టాడు. ఈ ఘటనలో రత్నకుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. వాహనదారులు గమనించి క్షతగాత్రుడిని చికిత్సనిమిత్తం ఆత్మకూరులోని ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్సై శివశంకరరావు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేశారు.

మహాసభలు జయప్రదం చేయండి



జెండా ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

ఉదయగిరి: బెంగళూరులో ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు జరిగే ఆలిండియా సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా నాయకుడు గడ్డం నాగేశ్వరరావు కోరారు. మంగళవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో ఆలిండియా మహాసభలపై సీఐటీయూ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో భూ వివాదాల పరిష్కారం



రీసర్వే రికార్డులను పరిశీలిస్తున్న జేసీ కూర్మనాథ్

• జేసీ కూర్మనాథ్

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రీసర్వే ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తోందని జేసీ రోణంకి కూర్మనాథ్ అన్నారు. మండలంలోని పార్లపల్లి, చౌకచెర్లలో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వందేళ్ల క్రితం చేసిన సర్వే కారణంగా ప్రస్తుతం పలు గ్రామాల్లో భూ వివాదాలు నెలకొన్నాయన్నారు. వాటిని పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి రీసర్వే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. దీని ద్వారా భూ వివాదాలకు పరిష్కారం లభిస్తోందని తెలిపారు. భూ సమస్యలను ఎదుర్కొంటున్న హక్కుదారులు రీసర్వే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సచివాలయం తనిఖీ

విడవలూరు సచివాలయాన్ని జేసీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వివిధ పథకాల బోర్డులను పరిశీలించారు. అలాగే వివిధ పథకాలను పొందిన లబ్ధిదారుల వివరాలతో కూడిన పట్టికను కూడా ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. ఈయన వెంట తహసీల్దార్ చంద్రశేఖర్, వీఆర్వోలు ఉన్నారు.